కథ

# అపరిచిత భాషలు

ఇంట్లో ఎలుక తిరుగుతుంది. రాత్రంతా అది చేస్తున్న చప్పుళ్ళు వినిపిస్తున్నాయి. అటక మీద నుంచి అటూఇటూ కదలుతున్న చప్పుడు, పరపరమంటూ దేన్నో కొరుకుతున్న చప్పుడు- ఆ శబ్దానికి చాలాసార్లు మెలుకువ వచ్చింది. "ఎలుక ఏదో తిరుగుతుందా!" అంటూ అతన్ని నిద్రలేపితే - అతను నిద్రమత్తులోనే అటుపక్కకు పొర్లి " అది ఎలుక కాదు! ఏదో పక్షి అయ్యుంటుంది! కాస్సే పట్లో ఎగిరి ఎగిరి పొద్దుటికి ఎటో వెళ్ళిపోతుంది!" అని విసుక్కొని మళ్ళీ నిద్రలోకి జారిపొయ్యాడు. పరపరమంటూ శబ్దం వినబడుతూనే ఉంది. ఇంటికప్పును కాబోలు అది తొలుస్తూనే ఉంది. మట్టో, ఇసుకో, తొలిచిన చెక్క తాలూకు పొట్టో, ఇంటి మధ్యన రాలుతున్న శబ్దం, అట్లా రాత్రంతా వినిపిస్తూనే ఉంది.



డా. వి. చంద్రశేఖరరావు

ఉదయం. ఇంకా పూర్తిగా తెల్లవారలేదు. అతను హడావుడిగా లేవటం తెలుస్తుంది. బ్రష్‌తో పరపరమంటూ రుద్దుకుంటున్న శబ్దం వినిపిస్తూనే ఉంది. ఆ తరువాత బాత్‌రూమ్‌లో నీళ్ళు జారిపడుతున్న శబ్దం కూడా. అతని రోజు మొదలైంది. కనీసం రెండుగంటలు ప్రయాణం చేస్తేగానీ అతను సిటీకి చేరడు.

మరింక లేవాలి! బద్ధకాన్ని పక్కన పెట్టి, వంటగదిలోకి వెళ్ళాలి! వెళ్ళి ఆమ్లెట్‌గానో, ఉప్మాగానో, చిక్కటి కాఫీగానో రూపాంతరం చెందాలి! శరీరం మాట వినదు. రాత్రి టివీ ప్రోగ్రాములన్నీ అయిపోయినాక, ఏ పదకొండుకో బెడ్‌రూమ్‌కు చేరతాడు. అప్పటిదాకా మేలుకోవాలి! అప్పుడు ఆ అపరాత్రి నిద్రనాపుకుంటూ, ఆవులింతల్ని లోపలికి కుక్కుకుంటూ ఒక శృంగారగీతంగానో, అతన్ని ఎరోజ్ చేసే పనిముట్టుగానో మారాలి! కొద్దినిముషాలకే అతను గురకగా, నిద్రగా మారిపోతాడు. సుఖమో, అలసటో తెలియని ఒంటరి నిద్రరానితనంతో రాత్రి చాలాసేపు అట్లా మేలుకొని - చీకటి, గురక, తడితడిగా చెమటగా, విసుగ్గా ఈసురోమంటున్న శరీరం - రాత్రిని కౌగలించుకొని మోహన రాగం కావాల్సిన శరీరం - హింసాత్మకమైన దృశ్యంలా మంచంపై, ఒక పదార్థంలా, ముద్దలా - మరింక రాత్రి హింసరచనలాగే సాగిపోతుంది. చీకటి, గురక, శరీరహింసకు తోడుగా ఇప్పుడు కొత్తగా ఈ ఎలుకలాంటి, పక్షిలాంటి జంతువు చేస్తున్న చప్పుళ్ళు - అట్లాంటి రాత్రిలోంచి మళ్ళీ ఐదుగంటలకే లేవాలి! లేచి, ఇల్లు ఊడ్చే, అంట్లుతోమే, స్టౌ వెలిగించే, బ్రేక్‌ఫాస్ట్, కాఫీ తయారుచేసే ఒకానొక ఎలక్ట్రానిక్ వస్తువులా - బొత్తిగా స్పర్శ తెలియనితనంతోనే ఉదయపు హడావుడంతా సాగిపోతుంది. స్విచ్ వేస్తే నడిచే యంత్రంలా, ఇల్లంతా కల తిరుగుతూ - ఈ యంత్రంతోనే జోక్‌లు వేస్తాడు అతను - టక్కుమని నవ్వు వెలుగుతుంది. ఈ యంత్రాన్నే విసుక్కుంటాడు, కోప్పడుతాడు - టక్కుమని ముఖం నల్లగా మాడిపోతుంది. ఎప్పుడైనా మూడ్‌బాగుంటే దగ్గరకు లాక్కుని, పెదాల్ని తడిచేసి - యంత్రం సహకరించదు!" నైస్‌గా ఉండటము తెలియని మొద్దువి!" అంటూ లేబుల్ తగిలించి అతను వెళ్ళిపోతాడు. స్విచ్ ఆఫ్ చేసి, యంత్రాన్ని బెడ్‌రూమ్‌కు తరలించి - హాయైన అమ్మవడిలాంటి నిద్ర అప్పుడు శరీరానికి కమ్ముతుంది.

ఎనిమిదిగంటల ఉదయం. పక్కయిళ్ళలోంచి ఎవరిదో రేడియో చాలాసేపటి నుంచి మోగుతూనే ఉంటుంది. బీప్‌బీప్ బీప్‌మంటూ నాలుగుసార్లు కూసినాక ఇంగ్లీషువార్తలు వినిపించటము మొదలుపెడుతుందా రేడియో! మృదువుగా, రెజోనెంటుగా ఉందా వార్తలు చదివే అమ్మాయి కంఠం. కంబాలపల్లెలో ఇళ్ళతో సహ సజీవంగా దహనం చెయ్యబడ్డ దళితుల గురించి చెబుతుంది. మగవాళ్ళందరినీ పొలాలమధ్య వెంటాడటము, స్త్రీలందరూ పొలాలమధ్యన తలదాచుకోవటం - ఆ దుఃఖకథనంతాచదువుతుందా అమ్మాయి. ఇంకా స్త్రీలకు 33 1/2 పర్సంట్ రిజర్వేషన్‌పై లోక్‌సభలో రభస - మధ్యలో వ్యాపారప్రకటనలు - ఆ వార్తలు ఇప్పట్లో ముగిసేలా లేవు! మంచానికి అతుక్కుపోయిన బొమ్మను ఊడబెరికి - లేపాలి! పాలపాకెట్లు, న్యూస్‌పేపర్లు, బయట ఇళ్ళు చిమ్ముతున్న అమ్మాయి - ఉదయంలోకి, పగటిలోకి, చలనంలోకి శరీరాన్ని ప్రవేశపెట్టాలి!

బయట సూర్యుడు రాలేదు. మబ్బులు కమ్మిన ఆకాశం. సన్నని తుంపర. గడపలో కూర్చుని కాఫీ తాగుతూ, పేపర్‌లో అన్ని పేజీలు వదిలేసి, లోపలి స్త్రీల పేజీలో సీరియల్ మాత్రం చదువుతూ- శరీరంపై సన్నని తుంపరపడుతూ - హాయిలాంటి, సుఖంలాంటిదేదో ప్రవహిస్తూ - "ఈ ఉదయం, చాలా హాయిగా ఉందే" అనుకుంటూ - "చయ్య చయ్య చయ్యా, చల్ చయ్యచయ్యా!" కాలేజీరోజుల్నాటి ఇష్టమైన పాట మెల్లగా గొంతులోంచి ఎగిసి - ఉదయం, చిరుజల్లు, వేడికాఫీ, ఇష్టమైనపాట, మధురమైన క్షణాల్లోకి మళ్ళీ ఎలుక ప్రవేశించింది. వంటగదిలో గిన్నెలు దబ్బుమని పడ్డ చప్పుడు, హడావుడిగా లోపలికి వెళితే, ఇంటిమధ్య నుంచి పరిగెడుతూ, హఠాత్తుగా గోడపైకి ఎగిరి, అక్కడ నుంచి కప్పుపైకి చేరి, క్షణాల్లో పరపరమంటూ శబ్దాలు చేస్తూ - అది ఎలుకకాదు! ఎలుక అట్లా ఎగరగలదా? పోనీ పక్షి అనుకుందామా - పక్షి అట్లా ఇంటిని తొలుస్తుందా? ఎలుకలాంటి, పక్షిలాంటి ఒక జంతువు. దాని మానాన దాన్ని వదిలేయాలని నిర్ణయించుకున్నా - అది మాత్రం నిరంతరహింసలా పరపరమంటూ శబ్దం చేస్తూ - కప్పును తొలుస్తూనే ఉంది.

ఇంటిమధ్యన పొడవాలి చెక్కమృగంలా డైనింగ్ టేబులు, ఇనుపమృగాల్లా కుర్చీలు, ఇనుప బీరువా నిశ్చలనంగా గోడకు ఆనుకొని నిలబడ్డ ఇనుపభూతంలా - అది యిల్లులా కాక జంతువిశేషంగానో లేదా నిర్జీవ పదార్థంలానో తోచింది. ఆరు నెలలు దాటుతుంది ఈ యింటిలోకి వచ్చి. ఆ యింట్లో ఏమూలనా జీవస్పర్శ కనబడదు. సిటీకి నలభైమైళ్ళ దూరం. హౌసింగ్ కార్పొరేషన్ ఇళ్ళుదాటి, సెంట్రల్ యూనివర్శిటీ దాటి, ఎక్కడో మూలనున్న చిన్న కాలనీ. సొంతయిల్లు. సిటీలో ఉద్యోగం- నాన్న భాషలో యిదో గొప్ప సంబంధం. మనిషి కూడ చూపులకు బాగుంటాడు. భలేభలే అన్నీ బాగా కుదిరాయని ఆయనా మురిసిపోయాడు. కాదనడానికి నాకూ ఏమీ కారణం కనబడలేదు. కానీ ఆరు నెలలు గడుస్తున్నా, ఆ మనిషి, ఆ యిల్లు కూడా అపరిచితంగా ఉండిపోవటము ఆశ్చర్యము, దిగులూను.

ఇంటిపైన ఇష్టం పెంచుకోవడానికి

రకరకాల డెకరేషన్లు చేశాను ఇంటికి. తేనె రంగు నూలు తివాచీ తెచ్చి గదిమధ్యలో పరిచి, ఇంటిమధ్యన వెదురుతో చేసిన బొమ్మలాంతర్లు వేలాడదీసి, గోడలపై నాలుగైదు పెయింటింగ్‌లు - ఇంటి బయట కాస్తంత పచ్చిక, నాలుగైదు పూల మొక్కలు - ఊహు! ఎన్ని అందాలు అద్దినా ఇల్లు అపరిచితమైన భాషలాగే ఉండిపోయింది. శరీరానికి సేదనిచ్చే ఇష్టమైన చోటు ఇంట్లో ఎక్కడా కనబడలేదు.

ఇంటికి చుట్టూ పెద్దగా ఇళ్ళులేవు. దూరంగా విసిరేసినట్లు, ఆ మూలనొకటి, ఈ మూలనొకటి, ఓ పదియిళ్ళు ఉంటాయి. ఆ యిళ్ళల్లో ఎక్కడా మనుషుల అలికిడి కనబడదు. బహుశా ఉద్యోగాలకో, స్కూళ్ళకో పోయుంటారు. యుద్ధసమయాల్లో వదిలేసిన యిళ్ళలా ఖాళీగా, ఒంటరిగా భయం గొలిపేలా ఉంటాయి. ఒక యింటిలోంచి మాత్రం నిరంతరము ఒక రేడియో వినిపిస్తూనే ఉంటుంది. ఆ యిల్లు దగ్గరో, దూరమో తెలియదు. కానీ రేడియో శబ్దాలు మాత్రం గట్టిగా, పక్కనుంచే వినిపిస్తున్నట్లుగా ఉంటాయి. అప్పుడప్పుడూ ఆ రేడియో వినడం ఒకపాస్ టైమ్‌గా, సరదా ఆటగా ఉంటుంది. 'ఈ టైములో రేడియోలోంచి ఏం వినిపిస్తుంది?' అనే వింత ఆట. ఎందుకో ఆ రేడియోలో పాటలు ఎక్కువగా వినబడవు. వార్తలు, సంభాషణలు, చర్చలు - బహుశా ఆ రేడియో వినేవాళ్ళు వార్తావిశేషాలకోసం కాక, మనుషుల కంఠస్వరాలు వినడం కోసమే అట్లా గంటల తరబడి రేడియో ఆన్‌చేసి ఉంచుతారేమో అనిపిస్తుంది.

సమయం పదికావస్తుంది. చుట్టపక్కల ఇళ్ళల్లో శబ్దాలన్నీ ఆగిపోయాయి. మనుషులు మసలే జాడలన్నీ ఆగిపోయాయి. వెంటవెంటనే మూడు సిటీబస్సులు వచ్చి వెళ్ళినాక పర్లాంగుదూరంలో ఉన్న రోడ్డు కూడా నిశ్శబ్దంగా మారింది. గురగురమంటున్న రేడియోచప్పుడు, ఇంటికప్పుపై నుంచి కలపకోసే యంత్రంలా శబ్దం చేస్తున్న ఎలుకా - మినహా అంతా నిశ్శబ్దం. పని అమ్మాయి పనులన్నీ చేసి, అదిగో పదిగంటల సిటీబస్సులో వెళ్ళిపోయింది. ఇప్పటి నుంచి సాయంత్రం దాకా ఏం చెయ్యాలన్నది గొప్ప సమస్య. వంట కూడా చేసుకోకుండా, అట్లాగే మంచంపై పడి నిద్రపోవటం, లేదా వంట చేసుకొని, లేచి అట్లా కిలోమీటరు దూరంలో ఉన్న షాపింగ్ సెంటరువైపు వెళ్ళిరావటం లేదా కిటికీ తెరిచి పక్కయింటిలోంచి వినబడే రేడియోలో మొత్తం ఎన్ని కంఠస్వరాలు, లేదా ఎన్ని వందల పదాలు, వాక్యాలు ఉన్నాయో వెతకటం లేదా ఎన్నిసార్లు భాషోచ్చారణలో దోషాలు వచ్చాయి? లేదా అర్థంకాని కొత్తవో, అసంబద్ధమైనవో విషయాలు ఎన్ని ప్రసారం అయ్యాయి - అదొక ఆట. వేరుసెనగపప్పు వేయించుకొని, డబ్బాలో పోసుకొని, ఒక్కొక్కటే తింటూ - అప్పుడు ఈ రేడియో ఆట థ్రిల్‌గా ఉంటుంది.

మార్కెట్టుకు వెళ్ళటం కొంచెం యిష్టం, కొంచెం భయమూ. మార్కెట్టులో బోలెడంతమంది మనుషుల్ని చూడొచ్చు. మాటల్ని, నవ్వుల్ని, బోలెడన్ని శబ్దాల్ని వినొచ్చు. భయమేమో, మార్కెట్టుకు వెళ్ళే తోవలో ఉన్న రైల్వేబ్రిడ్జిదగ్గర వచ్చిన కొత్తలో, వారం రోజులు కూడా కాలేదు, ఆ బ్రిడ్జీపై నుంచి ఎవరో కుర్రాడు దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. వాడు నేలపైన కూడా పడలేదు. బ్రిడ్జికి, రైలు పట్టాలకు మధ్యనున్న ఎలక్ట్రిక్‌తీగల మధ్యన ఇరుక్కుపోయి - ఆ శవం గుర్తుకొస్తే ఒళ్ళు జలదరిస్తుంది. ఇప్పటికీ ఆ బ్రిడ్జీ కిందన గాలిలో ఒక శవం అట్లా వేలాడుతున్నట్లు - ఆ బ్రిడ్జీ పైన వెళ్ళాలంటే భయం. పక్కన ఉన్న కాలిబాటలోనే వెళ్ళేది. అర కిలోమీటరు ఎక్కువ నడవాల్సివచ్చినా -

లేచి, స్నానం చేసి, ఇవాళ స్నానం చెయ్యటం ఒక వింత ప్రహసనంగా ముగిసింది. మామూలుగా స్నానం చేసినాక, ఒంటికి బట్టలు చుట్టకోకుండానే, బ్లూలాగూన్ సినిమాలోలాగ - ఆ నిర్జనమైన ప్రదేశంలో సిగ్గు, కంగారు లాంటి ఎమోషన్సు ఏమీ కలగవు. ఇల్లంతా అట్లా నడుచుకుంటూ వెళుతుంటే, అద్దంలోంచి లలిత మాత్రం "సిగ్గులేనిముండా!" అంటూ విసుక్కుంటుంది. "పోదూ!" అంటూ విలాసంగా - ఇవాళ మాత్రం ఎందుకో కంగారు వేసింది. ఇంటి పైకప్పులోంచి రెండు కళ్ళు, సన్నగా తేనెరంగులో, అటుఇటూ చికిలి స్తూ, ఎలుకలాంటి జంతువు తొలిచిన కప్పులోంచి మూతి బయటకుపెట్టి - దాన్ని చూడగానే కంగారుగా ఒంటిచుట్టూ చీర చుట్టుకొని - బజారుకు వెళ్ళికొనాల్సిన వస్తువుల లిస్టులో ఒకే ఒక ఐటమ్ - ఎలుకల బోను.

> ***పైకి ఎక్కేకొద్దీ గుంపు దగ్గరవుతుంది. భయంగా, గుబులుగా ఆయన వెంట నేను. అది ప్రమాదానికో, చావుకో సంబంధించిన గుంపుకాదు. కొద్దిగా రిలీఫ్ గుంపు మధ్యన ఒక మనిషి - బహుశా కోస్తా జిల్లాలకు చెందిన జానపద కళాకారుడైవుంటాడు. ఒక పుస్తకాన్ని తీసుకొని, శ్రావ్యంగా, రాగయుక్తంగా చదువుతున్నాడు. అది పద్యమూ కాదు, అట్లా అని వచనమూ కాదు - అదొక కథాగానం.***

రోడ్డు పక్కనే కాలిబాటపై - సిటీ బస్సుల జాడలేదు. ఒకటిరెండు ఆటోలు మాత్రం కనిపించాయి. కాస్తదూరం నడిచినాక మనుషుల సందడి కనబడసాగింది. అదో కాలనీ. వెంకారెడ్డో, పుల్లారెడ్డో ఎవడిపేరు మీదో ఏర్పడ్డ కాలనీ. కొద్దిగా కిక్కిరిసిన యిళ్ళు. ఇళ్ళ మధ్యన ఇంకా పొలాల జ్ఞాపకాలు కనబడుతున్నాయి. కాలనీ చివర ఉన్న ఒక డాబాయిల్లు - రచయిత సుందరం, ఆయన భార్యా ఉంటుంటారు. ఇంటిముందు వరండాలో రెండు కుర్చీలు వేసుకొని, పేపర్లో, పుస్తకాలో చదువుతూ - వాళ్ళను చూస్తే ఎంతో ముచ్చటేస్తుంది. పెద్దగా పరిచయం లేకపోయినా వీధిలో పోయే వాళ్ళందరినీ 'హలో' అంటూ పలకరిస్తాడాయన. ఇవాళెందుకో కుర్చీలు ఖాళీగా ఉన్నాయి.

ఆ యింటిని దాటితే రైల్వేట్రాక్. ట్రాక్ చుట్టూ నడుచుకుంటూ వెళితే - గొప్ప కోలాహలం! మనుషులు, మనుషులు, చప్పుళ్ళు, అరుపులు, కేకలు - 'ది మార్కెట్ ప్లేస్!'

ముందుగా కూరగాయల మార్కెట్టు. వాళ్ళు మాట్లాడుతున్నట్లుగా కాక పోట్లాడుతున్నట్లుగా ఉంటారు. ఆ కూరగాయలు అమ్మటం, సరైన ధర గిట్టించుకోవటం, అదో యుద్ధం వాళ్ళకు. విసుగ్గా కోపంగా ఉంటారు. అయినా వాళ్ళతో బేరం చేస్తూనో, కూరగాయల నాణ్యం చూస్తూనో గడపాలనిపిస్తుంది. దానిపక్కనే చేపల మార్కెట్టు. మురికిగా, గలీజుగా - ఆ చేపలట్లా చిన్నచిన్న తొట్లలోంచి ఎగిరిపడుతూ - వాటిని మళ్ళీ తొట్లలోకి విసిరి బేరం చేస్తూ - ఆ వాతావరణమూ బాగుంటుంది. అవి దాటుకొని వెళితే ఖరీదైన షాపింగ్‌ప్లేస్. అద్దాల షోకేసులు, అందమైన సేల్సుగరల్స్, అదో ఖరీదైన ప్రపంచము. ఎన్ని గంటలసేపు అక్కడ గడిపినా టైము తెలియదు. కాసిన్ని కూరగాయలు, ఒకచేప, వెతగ్గా వెతగ్గా దొరికిన ఎలుకలబోను - ఎలుకలబోను అట్లా చేతితో కుట్టుకొని నడవటం ఇబ్బందిగానే ఉంది. సిగ్గుగా, అనీజీగా ఉంది. అయినా అట్లాగే మార్కెట్టంతా తిరిగి - ఒకచోట ఆగి కూల్‌డ్రింక్ తాగి, ఇంకోచోట బేల్‌పూరి మసాలతిని - దాదాపు మూడుగంటల విహారం అది.

వెనక్కు ఇంటికి నడు స్తుండగా రచయిత సుంద రం కనిపించాడు. రైల్వేపట్టాల పక్కన చాలామంది కూలీలు కూర్చుని అన్నం తింటున్నారు. వాళ్ళమధ్యన కంకర గుట్టపై కూర్చుని - నన్ను చూసి దూరం నుంచే 'హలో' అంటూ చెయ్యి ఊపాడు. "రా!రా!" అంటూ సైగ చేశాడు. ఆయన చేతిలో టేప్‌రికార్డర్. వెళ్ళి ఆయన పక్కన రాళ్ళగుట్టపై కూలబడ్డాను.

ఎదురుగా ఒక మినీ గ్రామం. వాళ్ళందరు తెలంగాణా పల్లెలనుంచి వలస వచ్చినవాళ్ళు. కాస్తంత ఉర్దూ, కాస్త స్లాంగ్ కలిసిన భాష, అకల్మషంగా, హాయిగా ఉన్నాయి వాళ్ళమాటలు. పిల్లల అరుపులు, పెద్దవాళ్ళ కేకలు, ఆడవాళ్ళ నవ్వులు - అన్నీ టేప్ రికార్డర్‌లో రికార్డు అవుతున్నాయి. క్షణం సేపు కబుర్లు ఆపి, టేప్ రికార్డర్‌వైపు, సుందరంగారివైపు ఆశ్చర్యంగా చూస్తారు. మళ్ళీ కబుర్లు. దాదాపు అర్ధగంట అయినాక, టేప్‌రికార్డర్ ఆపి, ఆయన పైకి లేచాడు. జేబులోంచి అయిదు వందరూపాయల నోట్లు తీసి వాళ్ళ నాయకుడిచేతిలో పెట్టాడు. వాళ్ళ ఆశ్చర్యాన్ని, విసుగును పట్టించుకోకుండా ముందుకు నడిచాడు.

"నాకీ మనుషులు, వీళ్ళమాటలు అంటే ఎంతో యిష్టం. ఇవాళ వీళ్ళు మాట్లాడిన మాటల్లో కనీసం యాభైపదాలకు నాకు అర్థం తెలియదు. వీళ్ళ మాటల్ని ఇట్లా రికార్డు చేసుకొని మళ్ళీమళ్ళీ వింటుంటే - యూనో! ఇంట్లో ఇద్దరమేగా! మా యింట్లో మాటల కరువు! ఇట్లా రికార్డు చేసిన మాటలన్నీ ఒకగదిలో వేలాడదీస్తాను! దానికి 'లాంగ్వేజ్ బార్' అనీ, 'వరల్డ్ గాలరీ' అనీ -" గొప్ప ట్రాన్స్‌లో ఉన్నవాడిలా మాట్లాడుతున్నాడు ఆయన.

అట్లా మాట్లాడుతూనే రైల్వేబ్రిడ్జీదాకా వచ్చాము. పొడవుగా. ఎత్తుగా. బ్రిడ్జీ మధ్యగా గుంపుగా జనం. గుండెల్లో మళ్ళీ అలజడి. మరో శవాన్ని చూడాల్సి వస్తుందేమో అని. "నేనిట్లా కాలిబాటన వెళ్తాను సార్!" అన్నాను వణుకుతున్న గొంతుతో. "నోనో! ఇది దగ్గర తోవ! దీనిపై నుంచే వెళ్దాము! కమ్!" అంటూ బ్రిడ్జివైపు నడిచాడు ఆయన. పైకి ఎక్కేకొద్దీ గుంపు దగ్గరవుతుంది. భయంగా, గుబులుగా ఆయన వెంట నేను. అది ప్రమాదానికో, చావుకో సంబంధించిన గుంపుకాదు. కొద్దిగా రిలీఫ్ గుంపు మధ్యన ఒక మనిషి - బహుశా కోస్తా జిల్లాలకు చెందిన జానపద కళాకారుడైవుంటాడు. ఒక పుస్తకాన్ని తీసుకొని, శ్రావ్యంగా, రాగయుక్తంగా చదువుతున్నాడు. అది పద్యమూ కాదు, అట్లా అని వచనమూ కాదు - అదొక కథాగానం. ప్రకాశం జిల్లాలో యాభైఏళ్ళ క్రితం వచ్చిన ఒక కరువు గురించిన కథ. చుట్టూ ఉన్న జనం మంత్రముగ్ధులైనట్లుగా వింటున్నారు. తుఫాను వేగంతో సాగిపోతుందా కథ. వందలవేలుగా మాటలు, పదాలు - అవన్నీ ఏరుకొని ఇంట్లో కుప్పలు పోసుకోవాలని - గొప్ప ఉద్వేగంతో చలించిపోయాను. సుందరం గారి మాట చెప్పనలవికాదు. కథాగానం అయినాక ఆ గాయకుడు సంచిలోంచి చిన్న పుస్తకాల్ని తీసి, ఒక్కొక్కటి ఐదురూపాయలకు అమ్ముతున్నాడు. సుందరం గారూ, నేనూ రెండు రెండు పుస్తకాలు కొనుక్కొని -

బ్రిడ్జీ క్రిందకు దిగుతుంటే, ఇందాకటి కంగారు భయం మాయమై, వాటి స్థానంలో గొప్ప ఉత్సాహం శరీరంపై విద్యుత్తులా ప్రవహించసాగింది. దోవపొడుగునా సుందరం గారు కబుర్లు చెబుతూనే ఉన్నారు.

"మా అమ్మ చిన్నతనంలోనే చనిపోయింది. మా నాయనకు ఎనభైయేళ్ళ వయసు. ఇంకా ఆ పల్లెలో, పూరికొంపలో - ఆయనాపల్లెదాటిరాడు. మా పిల్లలిద్దరూ మా దగ్గరలేరు. ఒకడు ఆగ్రాలో, ఇంకోడు అమెరికాలో. ఇక్కడ ఈ యింట్లో మేం యిద్దరమే! రెండు నిశ్శబ్దపు ముద్దల్లా! పగటిపూట కాలక్షేపం కోసం నేను రాసిన నవలలే, ఒక్కొక్కటీ తీసి పెద్దగా చదవడం మొదలుపెడతాను. బుద్ధిమంతురాలైన స్టూడెంటులా ఆమె నా ఎదురుగా కూర్చుని శ్రద్ధగా ఆ నవలల్ని వింటుంది! ఇప్పుడు కొత్తగా ఈ మాటల సేకరణ! ఇదంతా ఒక గమ్మత్తయిన ఆట! ఒక కాలక్షేపం! నిశ్శబ్దంతో చచ్చిపోకుండా బ్రతికి ఉండడానికి

ప్రయత్నం!"

సుందరంగారి ఇల్లు దగ్గరైంది. ఒక గాఢమైన నిట్టూర్పుతో ఆయన షేక్ హాండ్ ఇచ్చి తన ఇంటివేపు నడిచాడు.

ఒకచేతిలో ఎలుకలబోను. రెండో చేతిలో కూరగాయల బుట్ట. కథల పుస్తకాలు - నడవగా, నడవగా, వీరరాఘవకాలనీ. కాలనీ చివరన, ఒంటరిగా, రెండువందల గజాల వైశాల్యం ఉన్న 'రవి నివాస్' అనే పేరున్న యిల్లు. ఎప్పటిలాగే మూగవాడిపాటలా, పరమ నిశ్శబ్దంగా. ఎండ. కొద్దిగా వానజల్లు. మళ్ళీ ఎండ. మధ్యాహ్నం ఒంటిగంట అయ్యింది. తలుపు తెరిచి లోపలకు అడుగుపెట్టటం తోటే రెండు చిరపరిచితమైన శబ్దాలు. రేడియోలోని కంఠస్వరాలు, ఎలుక తిరుగుతున్న చప్పుడు - ఇంటిపై కప్పును అరచేతి మందాన తొలిచినట్లుంది. ఆ కంతలోంచి రెండు మూడు చినుకులు ఇంట్లోకి జారిపడుతున్నాయి. కప్పును వదిలేసి గదుల్లో షికారు చేస్తుంది ఎలుక.

చిన్న ఎండుచేప ముక్కను బోనులో ఎరగా పెట్టి, ఎలుకల బోను వంటగదిలో పెట్టివచ్చాను.

వంటగదిలో ఉండగానే రేడియో శబ్దం పెద్దగా వినబడడం మొదలుపెట్టింది. స్త్రీల కార్యక్రమం అది. స్త్రీలపై శారీరక హింస అనే విషయం గురించి నలుగురు ఆడవాళ్ళు మాట్లాడుకుంటున్నారు. ఏవేవి 'హింస' జాబితా క్రిందకు వస్తాయో వివరిస్తుంది. ఇట్లా ఒంటరిగా ఇళ్ళల్లో ఉండటము కూడా హింస జాబితాలోకి చేర్చుకొమ్మని రేడియో వాళ్ళకు ఉత్తరం రాయాలని నిర్ణయించుకొన్నాను.

క్రమంగా రేడియో చప్పుళ్ళు తగ్గిపోయి, ఎలుక చేస్తున్న హడావుడి ఎక్కువైంది. కసిపట్టినట్లుగా ఇంటి కప్పును తొలుస్తుంది. ఆ చప్పుళ్ళమధ్యన నిద్ర పట్టింది.

నిద్రలేచేసరికి వంటగదిలో కిచకిచమంటూ పెద్దగా చప్పుడు. బోనులో ఎలుకలాంటి, పక్షిలాంటి పెద్ద జంతువు. కొద్దిగా ఉత్సాహం వేసింది. ఈల వేసుకుంటూ కాఫీ చేసుకొని ఎలుకల బోను ఎదురుగా కూలబడ్డాను. చాలాసేపు దాన్నే చూస్తూ - అది ఎలుకే. కాకుంటే కాస్త పెద్దది. మట్టిరంగులో, తేనెరంగుకళ్ళు - బోనులో అది నిర్భయంగా తిరుగుతుంది. దాని నిర్భయత్వం చూస్తుంటే ఎందుకో జెలసీ వేసింది.

బయట మళ్ళీ జల్లు మొదలైంది. ఇంటికప్పుపై సన్నటి జల్లు. జల్లుల మధ్య చీకటిపడింది. జల్లుల మధ్యనే అతనొచ్చాడు. రావటం తోటే టి.వీ ముందు కూలబడ్డాడు. క్రికెట్‌మ్యాచ్ అంటూ- ఇవాల్టి ఎలుక విజయాల్ని చెప్పాలని ఎంతో ఉబలాటం వేసింది. ఊహు! ఆ మనిషి వినే మూడ్‌లో లేడు. బౌండరీలు, సిక్సర్లు అంటూ క్రికెట్ గొడవతో ఇల్లంతా మోగిపోతుంది.

ఎప్పటిలాగే, అన్నం తిని, మళ్ళీ బెడ్‌రూమ్‌కు చేరి, రేడియో శబ్దాలు వింటూ - రేడియోలో ఇప్పుడు వార్తలు వస్తున్నాయి. వార్తలు అయిపోయినాక - హఠాత్తుగా రేడియో ఆగిపోయింది. ఇల్లంతా భయంకరమైన నిశ్శబ్దం. ఎవరైనా వచ్చి నాలుగుమాటలు మాట్లాడితే బాగుండు అనిపించింది. మధ్యాహ్నం కనబడిన రచయిత సుందరంగారు గుర్తుకొచ్చారు. బ్రిడ్జీపైన కథల్ని పాడే మనిషి గుర్తుకొచ్చాడు. సుందరంగారి మాటల మ్యూజియం చూడాలనిపిస్తుంది. అట్లా మనుషుల మాటల్ని యింట్లో వేలాడదీసు కొనే సదుపాయం ఏదైనా ఉందేమో కనుక్కోవాలనిపించింది.

రాత్రి తొమ్మిది, పది, పదకొండు - అప్పుడొచ్చాడు అతను. కొంచం విసుగ్గా ఉన్నాడతను. క్రికెట్ మ్యాచ్‌లో ఇండియా ఓడిపోయిందట! బట్టలు లూజు చేసుకొని, ఎప్పటిలాగే శరీరాన్ని సిద్ధం చెయ్యబోతే, మూడ్ లేదంటూ, ఇంకోవైపు తిరిగిపడుకున్నాడు.

గురక, నిద్ర, నిశ్శబ్దం - ఇల్లంతా బోసిపోయినట్లుగా - చుట్టుపక్కల ఎక్కడా ఎలాంటి శబ్దం వినబడటం లేదు.

హఠాత్తుగా లేచి, వంటగదివైపు వెళ్ళాను. లైటు తీసి, ఎలుకలబోను పైకి తీశాను.. దిగులుగా, నీరసంగా పడుకుంది ఎలుక. ఒక వింత ఆవేశం తోసుకురాగా, ఎలుకలబోను తలుపు తెరిచాను. సందేహంగా, భయంగా బయటకు దూకింది ఎలుక. కృతజ్ఞతలాంటి ఒక చూపు నా వైపు విసిరి, మళ్ళీ గోడపైకి దూకింది. గోడపై నుంచి ఇంటి కప్పుకు చేరి - పరపరమంటూ శబ్దం మళ్ళీ వినబడసాగింది.

లైటుతీసి, బెడ్‌రూమ్‌కు చేరి నిద్రపోడానికి ఉపక్రమించాను.

ఎలుకచేస్తున్న చప్పుళ్ళు, ఇప్పుడు హాయిగా జోలపాటలా వినిపించసాగాయి. ●

**ఒక వింత ఆవేశం తోసుకురాగా, ఎలుకలబోను తలుపు తెరిచాను. సందేహంగా, భయంగా బయటకు దూకింది ఎలుక. కృతజ్ఞత లాంటి ఒక చూపు నా వైపు విసిరి, మళ్ళీ గోడపైకి దూకింది. గోడపై నుంచి ఇంటి కప్పుకు చేరి - పరపరమంటూ శబ్దం మళ్ళీ వినబడసాగింది**

## స్వగతం

## మా అమ్మ రుణం తీరేది కాదు!


బి. పిచ్చమ్మ

అమ్మ ప్రేమని మించింది ప్రపంచంలో మరేదీ లేదు. 'తల్లి రుణం తీర్చలేరు' అన్న మాటని పెద్దలు అందుకే చెప్తుంటారు. ఈ మాటలు అక్షరాల మా అమ్మ విషయంలో రుజువైంది. ఆడపిల్లలంటే చాలామందికి చిన్నచూపు. పెంచడం కష్టమని, వాళ్ళ చదువులకు పెట్టే ఖర్చులు 'తిరిగిరా ని పెట్టుబడిగా' భావిస్తారు. కేవలం వ్యాపార సంబంధాల మీంచే ప్రపంచాన్ని అంచనా వేయడం వల్ల ఇలా జరుగుతోంది.

మా అమ్మ మాత్రం అందుకు పూర్తి భిన్నం. ఆమె మమ్మల్ని అపురూపంగా పెంచింది. తల్లి మమకారం ఎంత గొప్పగా వుంటుందో మాకు అడుగడుగునా అనుభవానికి తెచ్చింది. మా కుటుంబం సభ్యులం మొత్తం ఆరుగురం. నాన్న మేం చిన్న పిల్లలుగా వున్నప్పుడే చనిపోయారు. అమ్మా, నలుగురు పిల్లలం మిగిలాం. అందులో ఇద్దరు ఆడపిల్లలు. ఇద్దరు మగపిల్లలు. మా అక్కయ్యను ఆర్థిక ఇబ్బందుల వల్ల అమ్మ ఎక్కువ చదివించలేక పోయింది. ఆ విషయంలో అమ్మకు చాలా బాధ వుండేది. కనీసం నన్నయినా పెద్దచదువులు చదివించాలన్నది ఆమె ఆశయం. అందుకు గానూ ఆమె రేయింబవళ్ళు ఎంతో శ్రమించింది. ఒక పక్క ఇంటి పనులు చేస్తూ, మరో పక్క కూలిపనులకెళ్తూ ఆమె నన్ను చదివించింది. మిగతా ఇద్దరు తమ్ముళ్ళ చదువు విషయంలో కూడా ఎంతో శ్రద్ధవహించింది. నా చదువు కోసం, నా బాగు కోసం అమ్మపడే తాపత్రయం నాకు అనుక్షణం గుర్తుండేవి. ఆ స్ఫూర్తిని నా నుంచి ఎప్పటికీ దూరం కాదు.

నేను ఎమ్.కామ్., బి.యిడి చదివాను. చదువుకు తగ్గ ఉద్యోగం సంపాదించడంలో సఫలీకృతమయ్యాను. ఇప్పుడు నేను నరసరావుపేట మండలం పెద్దరెడ్డిపాలెంలోని మండల పరిషత్ ఎలిమెంటరీ పాఠశాలల ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేస్తున్నాను. నేనీ స్థాయికి రావడానికి అమ్మ చేయూతే ప్రధాన కారణం.

తల్లి ప్రేమ అనేది ఎంత గొప్పగా వుంటుందో మాకందరికీ మా అమ్మని చూసిన తర్వాతే అర్థమైంది. నిజంగానే ఆమె రుణాన్ని మేం ఎప్పటికీ తీర్చలేం.

-బి. పిచ్చమ్మ, ప్రధానోపాధ్యాయిని,
పెద్దిరెడ్డిపాలెం, నరసరావు పేట.

## హిందీ టీచర్ స్ఫూర్తితో...

చిన్నతనంలో మనల్ని ప్రభావితం చేసేవారిలో అమ్మా నాన్నల తర్వాత గురువే ముందుంటారు. అందుకనే, జీవితాంతం మనకి స్ఫూర్తినిచ్చిన గురువుల్ని మర్చిపోలేం. నేను పదవ తరగతి చదువుకునే రోజుల్లో మా హిందీ టీచర్ శ్యామలాబాయి నాకెంతో స్ఫూర్తిగా నిలిచారు.

నేను ఆరు నుంచి తొమ్మిదో తరగతి వరకూ చిత్తూరు జిల్లాలోని గిరింపేట మున్సిపల్ హైస్కూలులో చదివాను. ఆ సమయంలో మాకు హిందీ సబ్జెక్టులో బోధన ప్రారంభమయ్యింది. ఎందుకనో మొదటినుంచి నాకు హిందీ అంటే ఇష్టం ఏర్పడలేదు. దాంతో నేను ఆ సబ్జెక్టులో బాగా వెనుకబడి పోయాను. మిగతా పిల్లలు మాత్రం కాస్తంత శ్రద్ధగానే పాఠాలు ఆలకించి పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చుకునే వారు. నేను అందుకు పూర్తి భిన్నమైన రీతిలో వ్యవహరించే వాడిని. హిందీ భాషని పూర్తిగా నాకు సంబంధం లేని పరాయి భాషగా చూసేవాడిని. ఫలితంగా నాకు పరీక్షల్లో అత్తెసరు మార్కులొచ్చి మాస్టారు చేతిలో దెబ్బలు తినాల్సి వచ్చేది. చివరికి మొండిఘటంగా మిగిలిపోవాల్సి వచ్చింది.


సి. చక్రవర్తి

ఈ స్థితిలో నేను తొమ్మిదొ తరగతి పరీక్షలు రాసి పాసయ్యాను. పదో తరగతి మాత్రం చిత్తూరు పి.సి.ఆర్. ఉన్నత పాఠశాలలో చేరాను. అక్కడ మాకు కొత్త హిందీ టీచర్ శ్యామలాబాయి పరిచయమయ్యారు. ఆమె పిల్లల్ని ఎంతో ప్రేమగా పలకరించి చేరదీసేవారు. అంతేకాదు- హిందీ భాషపై నాకున్న భయాన్ని, దురభిప్రాయాన్ని పోగొట్టారు. ఎక్కడా విసుగు లేకుండా ఎంతో ఓపికతో మా అందరికీ హిందీ అక్షరాల్ని నేర్పారు. ఆ తర్వాత పాఠాలు చెప్పడం మొదలు పెట్టారు. మెల్లమెల్లగా మాకు హిందీ భాషపై అభిమానం పెరిగింది. పరీక్షల్లో పిల్లలందరం మంచి మార్కులు తెచ్చుకోగలిగాం. పట్టుదలతో నిజాయితీగా కృషిచేస్తే సాధించలేనిదేం లేదని శ్యామలాబాయి మాకు అనుభవ పూర్వకంగా నిరూపించారు. అందుకనే ఆమె స్ఫూర్తి ప్రత్యేకంగా నాపై చెరగని ముద్ర వేసింది. నేను గతంలో సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'మళ్ళీ బడికి పోదాం' కార్యక్రమంలో టీచర్‌గా జాయినయ్యాను. అక్కడ బాలకార్మికులకు చదువుపై ఆసక్తి కలిగించడంలో నాకు చేతనైన కృషి చేశాను.

- సి. చక్రవర్తి, చిత్తూరు